# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-07-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1) **ఆగస్టు 14 నాటికి గోదావరి జలాలను విశాఖ జిల్లాకు విడుదల చేస్తామన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2) **తెలంగాణాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు సాధించాలని పార్లమెంట్ సభ్యులకు సూచించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి .**

3) **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలకు అదనంగా 175 సీట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.**

4) **ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్ వోలకు అందజేయడానికి ఈరోజే చివరి రోజు.**

==========================

వచ్చే ఆరు నెలల్లో పోలవరం ప్రాజెక్ట్ కాలువ పనులన్నీ పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆయన నిన్న పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులపైనా ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..... గడిచిన రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టుపై 7 వేల 100 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని... 2027 మార్చి నాటికి అన్ని పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే 194 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని, 200 టీఎంసీల మేర వరద నీరూ వినియోగించుకోవచ్చని.... ఈ ప్రాజెక్టు ద్వారా 7.2 లక్షల ఎకరాలు నూతన ఆయకట్టు కిందకు చెరతాయని తెలిపారు. ఆగస్టు 14 వ తేదీన అనకాపల్లి వద్ద గోదావరి జలాలను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చెబుతూ..

వాయిస్ .30 సెకన్లు

--------------------------

తెలంగాణ కు చెందిన నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతుల సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులకు సూచించారు. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను ఆయన నిన్న పార్లమెంట్ సభ్యులకు హైదరాబాద్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ,

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించి హైదరాబాద్‌లో ఐ.ఐ.ఎం. మంజూరుకు విజ్ఞప్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-I స్వాధీనం, మెట్రో ఫేజ్-II విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సహకరిస్తున్నామని , రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామని రేవంత్ రెడ్డి సూచించారు.

---------------------------

వియత్నాం సముద్ర తీరంలో శనివారం జరిగిన బోటు ప్రమాదంలో మరణించిన వారి మృత దేహాలు మరి కొద్ది సేపట్లో హైదరాబాద్ లోని శంషాబాద్ ఏయిర్ పోర్టుకు చేరుకోనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎయిర్ పోర్టులో ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వియత్నాం బోటు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ముగ్గురు పర్యాటకులు మృతిచెందారు. మృతదేహాలను మృతుల స్వస్థలాలు మచిలీపట్నం, కడప, హిందూపురం నల్లపేటకు తరలించేందుకు ఏపీఎన్నార్టీ అధికారులు ప్రత్యేక అంబులెన్స్ లు సిద్ధం చేశారు.

---------------------------

తుంగభద్ర నది పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర జలశక్తిశాఖ 9 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు కేంద్ర జలవనరులశాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. గతనెల 25న తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగం, పరీవాహకంలోని రాష్ట్రాలు ఎదుర్కొం టున్న సమస్యలు కేంద్ర ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహకారంపై వారు చర్చించారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిందిగా 3 రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయి. ఈ నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ ఆదేశాలతో చింతూరు అటవీ ప్రాంతంలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ చల్లే ప్రక్రియను అధికారులు నిన్న ప్రారంభించారు. మనుషులు ప్రవేశించలేని అటవీ ప్రాంతాల్లో చెట్లు అంతరించి పోయిన ప్రాంతా లను గుర్తించి, అక్కడ పచ్చదనం పునరుద్ధరించేందుకు విత్తన బంతులు చల్లుతున్నారు. చింతూరు అటవీ పరిధిలో 440.50 హెక్టార్లలో అడవులు అంతరించినట్లు గుర్తించిన అధికారులు, పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. లక్కవరం రిజర్వ్ ఫారెస్ట్‌లో సీడ్ బాల్స్ చల్లారు. కంసులూరు, మర్రి గూడ, దేవరపల్లి, రేపాక, వాలి, సుగ్రీవ, భద్రాచలం, అటవీ బ్లాకుల్లో సీడ్ బాల్స్ చల్లే ప్రక్రియను అధికారులు త్వరలో చేపట్టనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలకు అదనంగా 175 సీట్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖమంత్రి వై. సత్య కుమార్ యాదవ్ చెప్పారు. వీటిలో పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 100 సీట్లు, విజయవాడ సిద్ధార్థ వైద్యకళాశాలలో 75 సీట్లు పెరగనున్నాయి. అమరావతి సచివాలయంలో మంత్రి నిన్న మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని నాలుగు

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కలిపి మొత్తం 325 అదనపు ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1 వెయ్యి 55 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని మంత్రి వివరించారు. ఈ నిర్ణయం వల్ల ప్రైవేట్ వైద్య కళాశాలల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా కన్వీనర్ కోటాలో 50 శాతం సీట్లు అందుబాటులో ఉండటం మరింత ఉపయుక్తంగా మారనుందని తెలిపారు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా సవరణ –ఎస్. ఐ. ఆర్– ప్రక్రియ లో భాగంగా ఓటర్లు తమ వివరాలను నింపిన ఎన్యూమరే షన్ పత్రాలను బీఎల్ వోలకు అందజేయడానికి ఈరోజే చివరి రోజు. ఈరోజు పూర్తిచేసిన ఎన్యూ మరేషన్ పత్రాలు బీఎల్ వోలకు అందజేయకపోతే జులై 21న విడుదలయ్యే ముసాయిదా జాబితాలో ఓటరు పేరు ఉండదు. ఇప్పటికే బీఎల్‌వోలకు ఎన్యూమరేషన్ పత్రం సమర్పించి ఉన్న ఓటర్లు .... దాన్ని అధికారులు పోర్టల్‌లో అప్లోడ్ చేసి డిజిటైజ్ చేశారో లేదో ఈసీఐ నెట్ యాప్ లేదా voters.eci.gov.in ద్వారా పరిశీలించవచ్చు. కాగా ....వివిధ రాజకీయ పార్టీల విజ్ఞప్తుల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గడువును పెంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా లేఖ రాశారు.

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర జలశక్తి అభియాన్ వర్షపునీరు ఒడిసిపట్టే “క్యాచ్ ది రైన్” అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అనేక జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. జులై 17న వచ్చే ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేయనున్నారు. ఏడాదిలో నాలుగుసార్లు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ఇందులో వైకుంఠ ఏకాదశి, ఉగాది ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలకు ముందుగా వచ్చే మంగళవారంనాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించి ఆలయాన్ని శుద్ధి చేస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ, యానాంలలో ఈ రోజు పొడి వాతవరణం ఏర్పడే అవకాశం ఉందని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ విశేషాలను సంబధిత అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ..

..వాయిస్ .. 25 సెకన్లు

ఇదిలా ఉండగా... తెలంగాణలో రాబోయే రెండు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================